# ప్రజాధనం కొల్లగొడుతున్న ప్రభుత్వం: తుమ్మల



**జూలూరుపాడులో జరిగిన సభలో ప్రసంగిస్తున్న తుమ్మల**

జూలూరుపాడు, డిసెంబరు 30 (న్యూస్‌టుడే): అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమం కన్నా ప్రజాధనాన్ని కొల్లగొట్టడంపైనే దృష్టి సారించిందని తెదేపా జిల్లా అధ్యక్షుడు తుమ్మల నాగేశ్వరరావు విమర్శించారు. పార్టీ జిల్లా కమిటీ చేపట్టిన సైకిల్ యాత్ర ఆదివారం జూలూరుపాడు చేరుకుంది. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో ఆయన ప్రసంగిస్తూ నాలుగేళ్ల పాలనలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాజెక్టుల పేరుతో కోట్లాది రూపాయలు వెనుకేసుకుందన్నారు. తొమ్మిదేళ్ల తెదేపా పాలనలో జరిగిన అభివృద్ధి తప్ప కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఒరగబెట్టిందేమీ లేదన్నారు. దుమ్ముగూడెం ప్రాజెక్టు ద్వారా జిల్లాను సస్యశ్యామలం చేస్తామన్న హామీలను ప్రభుత్వం బుట్టదాఖలు చేసిందన్నారు. వికలాంగులకు, సమర యోధులకు పింఛన్ ఇచ్చినట్లే అవసాన దశలో ఉన్న రైతులకు కూడా పింఛన్ ఇచ్చే యోచనపై నిర్ణయం తీసుకుని తెదేపా అధికారంలోకి వస్తే అమలు చేస్తుందన్నారు. రూ. వెయ్యి కోట్లతో నిధిని ఏర్పాటుచేసి పంటలకు గిట్టుబాటు ధర కల్పిస్తామన్నారు. నిరుద్యోగ యువతకు రూ. వెయ్యి చొప్పున భృతి చెల్లించడంతో పాటు రైతుల రుణాలు మాఫీ చేసి కొత్తగా 10 పైసల వడ్డీకే రుణాలు పంపిణీ చేస్తామన్నారు. సైకిల్‌యాత్ర ద్వారా ప్రభుత్వ విధానాలను ఎండగడుతూ ప్రజలను చైతన్య పరుస్తున్నామన్నారు. తెదేపా రాష్ట్ర కార్యదర్శి నామ నాగేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాకనే సంక్షేమం కుంటుపడిందన్నారు. రైతులు, నిరుపేదలు, నిరుద్యోగులు, మహిళలు మూడన్నరేళ్లుగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నా ప్రభుత్వం కళ్లు తెరవడం లేదని విమర్శించారు. పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించని ప్రభుత్వం సిమెంటు, స్టీలుకు పెంచి భారంమోపుతోందన్నారు. ఇందిరమ్మ ఇళ్లు కట్టుకోలేక పేదలు అప్పులపాలవుతున్నారని పేర్కొన్నారు. సుజాతనగర్ నియోకవర్గ ఇన్‌ఛార్జి పోట్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రాజెక్టులు నిర్మించేది రైతుల కోసం కాదని కాంట్రాక్టర్లు మెక్కేందుకేనన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి కోనేరు నాగేశ్వరరావు, సండ్ర వెంకటవీరయ్య, కొండబాల కోటేశ్వరరావు, తాటి వెంకటేశ్వర్లు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి మందడపు సుధాకర్, రాష్ట్ర కార్యదర్శి ఎల్లంకి సత్యనారాయణ, పార్టీ జిల్లా కార్యదర్శి పాండురంగారావు, శెట్టి రంగారావు, తెలుగుమహిళ రాష్ట్ర కార్యదర్శి బేబీ స్వర్ణ కుమారి, మండల పార్టీ అధ్యక్షుడు పి.జి.కృష్ణమూర్తి పాల్గొన్నారు.

**చంద్రుగొండ:** ముగ్గురు మంత్రులుండీ జిల్లాను భ్రష్టుపట్టించారని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి, సైకిల్‌యాత్ర రథసారధి నామ నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం చంద్రుగొండ వచ్చిన సైకిల్‌యాత్రలో భాగంగా మద్దుకూరు, దామరచర్ల గ్రామాల్లో జరిగిన సభల్లో నామ నాగేశ్వరరావు మాట్లాడారు. పేద ప్రజలు వైద్యం కోసం అల్లాడిపోతున్నారని ప్రభుత్వ ఆసుపత్రులలో వైద్యులు, మందులకొరత తీవ్రంగా ఉందని మంత్రులు మాత్రం వారికిష్టం వచ్చినంత దండుకుంటున్నారని ఆరోపించారు. అధికార ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా తాను సైకిల్ యాత్ర చేపట్టానన్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు ఇవ్వడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. జిల్లా ఎం.పి., కేంద్రమంత్రి రేణుకాచౌదరి జిల్లాకు వచ్చినప్పుడల్లా ఆడబిడ్డనని చెప్తూ పబ్బం గడుపుకుంటున్నారన్నారు. సభలో మాజీ మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, కోనేరు నాగేశ్వరరావు, ప్రోగ్రాం మేనేజర్ శెట్టి రంగారావు, మండల తెదేపా నాయకులు భోజ్యానాయక్, మోహన్‌రావు, బి.అప్పారావు, సత్యనారాయణ పాల్గొన్నారు.